సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 31 । మార్చి । 2023

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:29	శని: 4:48

న్యూస్‌రీల్

ఆదివాసీ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సక్కు

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఆదివాసీ భవనాన్ని ఎమ్మెల్యే ఆత్రం సక్కు గురువారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అంతకు ముందు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమ్మేళనం నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. కార్యకర్తలు, పార్టీ నాయకులకు ఎలాంటి ఇబ్బంది కాకుండా ఏర్పాట్లు చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు అజయ్ కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట సర్పంచులు బండె తుకారాం, అయ్యూబ్, కిష్టు, దేవ్‌రావు, కమలాకర్, ఎంపీటీసీలు, ప్రవీణ్, మారుతి, నాయకులు దీపక్ ముండె తదితరులు ఉన్నారు.

‘కలెక్టరేట్’ ముట్టడి విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల(సిర్పూర్): ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పిట్టల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని తలోడి గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. నాయకులు రాజేశ్, సిద్దయ్య, శంకర్, భిక్షపతి, మధునయ్య, రాజయ్య, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

తరగతులకు హాజరవ్వాలి

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో ఓపెన్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు 2023– 24 సంవత్సరానికి కాంటాక్ట్ కం కౌన్సిలింగ్ తరగతులు ఏప్రిల్ 2, 8, 9, 16, 23 తేదీల్లో కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ తెలిపారు. సెమిస్టర్ 2, 4, 6 చదువుతున్న విద్యార్థులు తప్పకుండా కౌన్సిలింగ్ తరగతులకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 98663 98678 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కల్యాణ వైభోగమే!



జన్కాపూర్‌లో కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

- జిల్లా వ్యాప్తంగా కనుల పండువగా శ్రీసీతారాముల కల్యాణం
- జిల్లా కేంద్రంలో ఉత్సవ విగ్రహాలతో భారీ శోభాయాత్ర
- రామనామ స్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
- భారీగా తరలివచ్చిన భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్, రెబ్బెన, దహెగాంతో పాటు మండల కేంద్రాల్లోని రామాలయాల్లో శ్రీసీతారాముల కల్యాణం గురువారం ఘనంగా జరిపించారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో అర్చకులు నిమ్మకంటి సంతోష్ శర్మ, ఒరుగుల శిరీశ్ శర్మ, పూర్ణచందర్ శర్మ, మహేశ్ శర్మ, శ్రీధర్ శర్మ, ముదిగొండ రాజశేఖర శర్మ, ఢిల్లీ విజయకుమార్, అనంత్ శర్మ, నాగేశ్వర్, శేఖర్ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలోని తుజాల్‌పూర్ మురళీగౌడ్ ఇంటి నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాలతో హనుమాన్ దీక్షాస్వాములు గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా జన్కాపూర్ రామాలయం వరకు శోభాయాత్ర కొనసాగించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, సోనేరావు దంపతులు, కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, మంగళ సూత్రం, ముత్యాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శుభ లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చి కల్యాణం తిలకించారు. జన్కాపూర్ నుంచి ఆసిఫాబాద్ పట్టణం వరకు రాష్ట్రీయ రహదారిపై మైకులు ఏర్పాటు చేశారు.

ప్రముఖుల పూజలు

శ్రీరామనవమి పురస్కరించుకుని కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదనపు కలెక్టర్ రాజేశం, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీ శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్ బాబు సీతారాములను దర్శించుకున్నారు.



పట్టు వస్త్రాలతో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, కుటుంబ సభ్యులు



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే కోనప్ప దంపతులు



పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ రాజేశం దంపతులు



పూజల్లో పాల్గొన్న ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, తదితరులు



రెబ్బెన: సీతారాములకు తలంబ్రాలు పోస్తున్న జీఎం దేవేందర్



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు



రెబ్బెన: సీతారాముల విగ్రహాల వద్ద సందడి చేస్తున్న వానరాలు

‘కంటి వెలుగు’ వాహనాలకు బ్రేక్?

కంటి వెలుగు రథచక్రాలు నిలిచిపోనున్నాయి. ప్రభుత్వం నుంచి అద్దె బిల్లులు రాక వాహన యజమానులు పడరాని పాట్లు పడుతున్నారు. భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం తమను ఇబ్బందులకు గురిచేస్తోందని యజమానులు ఆరోపిస్తున్నారు.

- విడుదల కాని అద్దె డబ్బులు
- ఇబ్బందుల్లో యజమానులు
- ఫైనాన్స్ కట్టలేని పరిస్థితి..

చింతలమానెపల్లి(సిర్పూర్): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. ప్రతీ గ్రామ పంచాయితీలో కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలు నేత్ర పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఆయా గ్రామాలకు వైద్యసిబ్బంది చేరవేసేందుకు అద్దె ప్రాతిపదికన ఒప్పందం చేసుకున్న వాహనాలను వినియోగిస్తున్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా జనవరి 18 నుంచి ప్రారంభించారు. కంటి వెలుగు కోసం వైద్య బృందాలు, సామగ్రిని కేంద్రాలకు చేరవేయడానికి 26 వాహనాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ వాహనాలను సంబంధిత శిబిరం అధికారులు, ఆయా వైద్యాధికారులు స్థానికంగా ఉన్న పరిచయాలతో ఏర్పాటు చేసుకున్నారు. కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనానికి నెలకు రూ.33వేల అద్దె, నెల రోజుల సమయంలో 2వేల కిలోమీటర్లు తిరిగే విధంగా ఒప్పదం చేసుకున్నారు. శిబిరాల నిర్వహణ సమయం ఆధారంగా కంటి వెలుగు వాహనాలు 2 నెలల నుంచి 6 నెలల పాటు కేటాయించాలని ఒప్పందంలో పేర్కొన్నారు.



చింతలమానెపల్లి మండలంలోని కంటి వెలుగు శిబిరం వద్ద వాహనం

బిల్లులకు తప్పని ఎదురుచూపులు..

జనవరి 18 నుంచి వాహనాలను కంటి వెలుగు కార్యక్రమం కోసం వాహనాల యజమానులు అద్దెకు ఒప్పందం ప్రకారం నడుపుతున్నారు. ముందస్తుగా ఎలాంటి చెల్లింపులు లేకపోవడంతో వాహనం నడపడానికి డీజిల్, ఇతర ఇంధనం, డ్రైవర్ల వేతనం, ఖర్చులు వాహనాల యజమానులే చెల్లిస్తున్నారు. ఈ నిర్వహణకు ప్రతినెలా రూ.15వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చవుతోందని వాహనాల యజమానులు చెబుతున్నారు. జనవరి 18 నుంచి నేటి వరకు రెండు నెలలకు పైగా సమయం గడిచింది. ప్రభుత్వం ఇప్పటివరకు వాహనాలకు ఎలాంటి అద్దె చెల్లించలేదు. వైద్యాధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి బిల్లులు రాలేదని సమాధానం ఇస్తున్నారని యజమానులు వాపోతున్నారు.

నిర్వహణ భారం

కంటి వైద్యశిబిరాలకు వాహనాలు అద్దెకు ఇచ్చిన యజమానులు వాహనాలను ఫైనాన్స్, ఇతర పథకాల ద్వారా పొందిన వారే అధికంగా ఉన్నారు. ఈ వాహనాల నిర్వహణకు ప్రతినెలా ఫైనాన్స్ కిస్తీతోపాటు ట్యాక్స్, ఇతర నిర్వహణ ఖర్చులు ఉంటున్నాయి. మరో వైపు ప్రతిరోజూ కంటివెలుగు శిబిరాలకు వాహనం నడపడానికి ఇంధనం చార్జీలు వారే చెల్లించాల్సి వస్తోంది. ఫైనాన్స్ కిస్తీలు చెల్లించకపోవడంతో బ్యాంకుల నుంచి ఒత్తిడి వస్తోందని యజమానులు వాపోతున్నారు. వాహనాల అద్దె చెల్లించి తమకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ప్రతినెలా చెల్లించాలి



ప్రభుత్వం చేపట్టిన పథకం కావడంతో ఎలాంటి ఆలోచన లేకుండా వాహనాన్ని కంటి వెలుగు పథకంలో అద్దెకు ఇచ్చాను. అద్దె ప్రతినెలా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. అద్దె చెల్లించకపోతే వాహనాలు ఎలా నడిపిస్తాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– వసంత్, చింతలమానెపల్లి

ఇబ్బంది పడుతున్నాం



వాహనాల అద్దెకు ఇచ్చి రెండు నెలలు దాటింది. కిరాయి డబ్బులు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఫైనాన్స్ సంస్థ కిస్తీ కోసం ఒత్తిడి తెస్తోంది. కిస్తీ కట్టకుంటే ఫైనాన్స్ ఇచ్చిన వారు వాహనాన్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఒప్పందం ప్రకారం వాహనాల అద్దెను వెంటనే చెల్లించాలి.

– గాండ్ల శ్రీనివాస్, కౌటాల

ఆదివాసీలకు అందుబాటులో వైద్యం

గిరిజన జిల్లాలో సర్కారు వైద్యం మెరుగుపడనుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైద్యకళాశాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించారు.

- శరవేగంగా సాగుతున్న మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు
- ఇప్పటికే 50 శాతం పూర్తి
- ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రంలో వైద్యసేవలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కళాశాలను ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గిరిజనులు అధికంగా ఉండే కుమురంభీం జిల్లాకు వైద్యకళాశాలను మంజూరు చేసింది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి గతేడాది జిల్లాలో పర్యటించి వైద్యకళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామ శివారులో అక్టోబర్‌లో నిర్మాణ పనులను ప్రారంభించారు. మొత్తం 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.32 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. కళాశాల భవనాలు 3 నుంచి ఐదెకరాల్లో ఎనిమిది బ్లాకులుగా నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

మెరుగుపడనున్న వైద్యసేవలు

పరిపాలన సౌలభ్యం రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. కుమురంభీం ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన తర్వాత కూడా వైద్యపరంగా పెద్దగా ప్రగతి కనిపించలేదు. ఇక్కడి ప్రజలు వైద్యం కోసం మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి పట్టణాలతోపాటు సరిహద్దులో ఉన్న మహారాష్ట్రకు సైతం వెళ్తున్నారు. ముఖ్యంగా ప్రసవాలకు జిల్లా వాసులు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. స్వయంగా వైద్యులే మంచిర్యాలకు రెఫర్ చేస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏటా వర్షాకాలంలో సకాలంలో వైద్యమందక పలువురు మృత్యువాత పడిన ఘటనలు సైతం అనేక ఉన్నాయి. నూతన వైద్యకళాశాల ఏర్పాటుతో జిల్లాలో వైద్యసేవలు మెరుగు కానున్నాయి. మొదట జిల్లా కేంద్రం సమీపంలోని అంకుసాపూర్ 340 పడకల జిల్లా ఆస్పత్రి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.53 కోట్లు మంజూరు చేసింది. అధికారులు టెండర్లు పిలువగా రూ.28కోట్లకు ఓ గుత్తేదారు పనులను దక్కించుకున్నారు. ఆ తర్వాత జిల్లాకు వైద్యకళాశాల మంజూరు కావడంతో జిల్లా ఆస్పత్రి భవనం నిర్మాణ నమూనాలో మార్పులు చేసి వైద్యకళాశాలకు అనుగుణంగా పనులు చేపట్టారు. జిల్లా కేంద్రంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి భవనంపైన మరో అంతస్తు నిర్మించేందుకు రూ.9కోట్లతో టెండర్లు పిలిచారు. 150 పడకల సామర్థ్యంతో ఉండేలా ఆస్పత్రిని మార్చనున్నారు.



అంకుసాపూర్‌లో కొనసాగుతున్న వైద్యకళాశాల భవనం నిర్మాణ పనులు

ఈ ఏడాది నుంచే తరగతులు..

నాలుగెకరాల్లో 8 బ్లాకులతో వైద్యకళాశాలను నిర్మిస్తున్నారు. ఈ ఏడాది 100 సీట్లు భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏటా తరగతులు పెరుగుతాయి. ఇటీవల నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లోనూ కలెక్టర్ హేమంత్ బోర్కడే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థినులకు వేర్వేరుగా వసతి కల్పించేలా భవన నిర్మాణం చేపడుతున్నారు. ఒక్కో బ్లాకు నిర్మాణం కోసం ఇంజనీరింగ్ అధికారితోపాటు జిల్లా స్థాయి అధికారులను ఇన్‌చార్జీలు నియమించారు.

పనులు కొనసాగుతున్నాయి

జిల్లాలో వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. అలాగే 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిపైనే మరో ఫ్లోర్ నిర్మిస్తున్నాం. జూన్ నెలలో ఎన్‌ఎంసీ బృంద సభ్యులు వసతులు పరిశీలిస్తారు. అప్పటివరకు పనులు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

– స్వామి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

రెట్టింపు లక్ష్యం..!

- టార్గెట్ సాధనలో ఏఎంసీల వెనుకంజ
- తగ్గిన మార్కెట్ యార్డుల ఆదాయం
- ధాన్యం కొనుగోళ్లతో వచ్చే సెస్‌తోనే.. వ్యవసాయ మార్కెట్ యార్డుల నిర్వహణ
- ఈసారి ఆదాయ లక్ష్యం మరింత పెంపు

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొన్నేళ్ల కిందట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లకు ఆదాయం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు లభించేది. ప్రస్తుతం ఈ ఆదాయం సుమారుగా సగానికి పడిపోయింది. మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు ఇటీవల నిర్మల్ జిల్లాలో ఉమ్మడి మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. గత మూడేళ్లలో ఏఎంసీలకు లభించిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని దానిపై 20 శాతం పెంచేలా ప్రణాళిక చేశారు. త్వరలో ఈ లక్ష్యం ఖరారు కానుంది. అయితే లక్ష్య సాధనలో మార్కెట్ కమిటీలు విఫలమవుతున్నాయి.

ఎందుకీ పరిస్థితి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, వరి, సోయాబీన్, పప్పుదినుసులు, మొక్క జొన్న తదితర పంటల కొనుగోలుపై మార్కెట్ కమిటీలకు ఒక శాతం సెస్ లభిస్తుంది. దీని ఆధారంగానే ప్రతీ ఏడాది లభించే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని మార్కెటింగ్ అధికారులు ఏఎంసీల వారీగా ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. అయితే పత్తి కొనుగోళ్ల విషయంలో రెండేళ్లుగా ప్రైవేట్‌లో మద్దతు ధరను మించి ఉండడంతో భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు రంగంలో లేదు. అలాగే ఈ ఏడాది పత్తి ధర పెరుగుతుందన్న ఆశతో రైతులు పూర్తి స్థాయిలో పత్తిని విక్రయించలేదు. ఈ ప్రభావం మార్కెట్ సెస్‌పై పడింది. అంతే కాకుండా పలువురు రైతులు పత్తికి ఇక్కడి కంటే మహారాష్ట్రలో ధర అధికంగా లభిస్తుందని అక్కడికి తీసుకెళ్లి విక్రయించారు. ఈ ప్రభావం ఆదాయంపై అమితంగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో వరి మద్దతు ధరతో కొనడంతో దాని ద్వారా వచ్చే సెస్ యథావిధిగా వచ్చింది. అయితే ఈ నాలుగు జిల్లాల్లో పత్తి పెద్ద ఎత్తున కొనుగోలు జరిగే మార్కెట్ యార్డుల్లో ఈ ఏడాది కొనుగోళ్లు మందగించడంతోనే పరిస్థితి ఇలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాల వారీగా ఇదీ పరిస్థితి..

మరి కొద్దిరోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీల ద్వారా 2022–23లో రూ.9.83 కోట్ల ఆదాయం వచ్చే పరిస్థితి ఉండగా 2023–24 ఆర్థిక సంవత్సరం ఆదాయ లక్ష్యం రూ.16.55 కోట్లు నిర్దేశించేలా ప్రణాళిక చేశారు. నిర్మల్ జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీల నుంచి ఈ ఏడాది రూ.11.20 కోట్లు ఆదాయం వచ్చే పరిస్థితి ఉండగా.. వచ్చే ఏడాది రూ.12.46 కోట్లు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మూడు మార్కెట్ కమిటీల్లో ఈ ఏడాది రూ.7.38 కోట్లు వచ్చే పరిస్థితి ఉండగా.. వచ్చే ఏడాదికి రూ.10.01 కోట్లు, మంచిర్యాల జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీల్లో ఈ ఏడాది రూ.8.30 కోట్లు వచ్చే పరిస్థితి ఉండగా.. వచ్చే ఏడాది కోసం రూ.14.26 కోట్లు లక్ష్యం రావాలని ప్రణాళిక రూపొందించారు.



ఆదిలాబాద్ ఏఎంసీ కార్యాలయం

ఏఎంసీల వారీగా ఆదాయ లక్ష్య ప్రణాళిక

మార్కెట్‌యార్డు	లక్ష్యం
ఆదిలాబాద్	రూ.10.35 కోట్లు
ఆసిఫాబాద్	రూ.6.68 కోట్లు
చెన్నూర్	రూ.5.95 కోట్లు
భైంసా	రూ.5.45 కోట్లు
లక్సెట్టిపేట	రూ.3.65 కోట్లు
నిర్మల్	రూ.3.50 కోట్లు
కాగజ్‌నగర్	రూ.2.54 కోట్లు
బోథ్	రూ.2.22 కోట్లు
బెల్లంపల్లి	రూ.2.18 కోట్లు
ఖానాపూర్	రూ.1.80 కోట్లు
జైనథ్	రూ.1.58 కోట్లు
ఇంద్రవెల్లి	రూ.1.43 కోట్లు
మంచిర్యాల	రూ.1.27 కోట్లు
జన్నారం	రూ.1.20 కోట్లు
సారంగాపూర్	రూ.1.20 కోట్లు
ఇచ్చోడ	రూ.97 లక్షలు
జైనూర్	రూ.79 లక్షలు
కుభీర్	రూ.51 లక్షలు

త్వరలో లక్ష్యాలు ఖరారు

మార్కెట్ల వారీగా 2023–24 సంవత్సరం ఆదాయ లక్ష్య ప్రణాళిక రాష్ట్ర అధికారుల వద్ద ఉంది. త్వరలో ఈ టార్గెట్‌కు సంబంధించి ఉత్తర్వులు వెలువడతాయి. పత్తి కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో మార్కెట్లకు పూర్తి స్థాయిలో ఆదాయం లభించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్ల విషయంలో ఉన్న పరిస్థితే ఇక్కడా ఉంది. దీంతో ఆదాయం తగ్గింది.

– శ్రీనివాస్, డీఎంవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

శవమై కనిపించిన వృద్ధుడు

మందమర్రిరూరల్: ఈ నెల 12న ఇంటి నుంచి వంట చెరుకు కోసమని బయటకు వెళ్లిన సత్తయ్య గురువారం శవమై కనిపించాడు. ఎస్సై మహేందర్ వివరాల ప్రకారం... మండలంలోని చిర్రకుంట గ్రామానికి చెందిన కడియాల సత్తయ్య (62) సమీపంలోని అటవీ ప్రాంతానికి కట్టెల కోసం వెళ్లి తిరిగి రాలేదు. సత్తయ్య అప్పుడప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి నాలుగైదు రోజులకు ఇంటికి వచ్చే వాడు. అదే విధంగా వస్తాడని కుటుంబ సభ్యులు ఎదురుచూశారు. గురువారం గ్రామస్తులు కొందరు అటవీ ప్రాంతానికి వెళ్లగా అక్కడ శవం కనిపించగా పోలీసులకు విషయాన్ని తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లిన ఎస్సై మహేందర్ సత్తయ్యగా గుర్తించి వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసు కమాండ్ కంట్రోల్ భవనంలో చోరీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రాంనగర్ బస్తీ ప్రాంతంలో కొత్తగా నిర్మాణం చేసిన పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్ భవనంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అగంతకులు బుధవారం రాత్రి లేదా అంతకన్న ముందుగానే చోరీ చేసినట్లుగా తెలుస్తోంది. భవన నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ కె.పద్మారెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కమాండ్ కంట్రోల్ రూమ్ భవనానికి అమర్చిన 10 టేకు తలుపులు, 14 ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. నాలుగేళ్ల క్రితం ఈ భవనాన్ని కాంట్రాక్టర్ పద్మారెడ్డి నిర్మాణం చేశారు. ఇంతవరకు పోలీసుశాఖ దీనిని స్వాధీనం చేసుకోలేదు. నిర్మాణం పూర్తయినప్పటి నుంచి ఖాళీగానే ఉంటోంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

వాంకిడి: మండలంలోని సవాతి గ్రామానికి వెళ్లే రహదారిపై ఆర్లీ గ్రామ సమీపంలో పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రం నుండి సవాతి, ధాబా వైపు ప్రయాణికులతో వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనం ప్రమాదానికి గురైంది. సుమారు 10 మంది ప్రయాణికులతో వెళ్తున్న సమయంతో దొడ్డిగూడ గ్రామం వైపు నుంచి వాంకిడి వైపునకు వస్తున్న డిబిఎల్‌కు చెందిన ఓ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో టాటా మ్యాజిక్ వాహనం స్వల్పంగా దెబ్బతింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

'భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదాన్ని అడ్డుకోవాలి'

పాతమంచిర్యాల: భగత్‌సింగ్ దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకుని దేశంలో మతోన్మాదాన్ని అడ్డుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రేంకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కళాశాల హాస్టల్‌లో స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా, ప్రేంకుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం చిన్నతనంలోనే పోరాటాలు చేసిన విప్లవ కెరటాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అన్నారు. ఆ రోజుల్లో సమానత్వం, విద్య, ఉపాధి, హక్కుల కోసం పోరాటం చేస్తే ఈరోజు దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మత ఘర్షణలు, కులాల పేరుతో దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. వీటిని ఎదుర్కొనేందుకు విప్లవ పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మతోన్మాదం, కుల ఉన్మాదంపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతోన్మాదం పెరిగిందని తెలిపారు. యువకుల్లో మతాన్ని నింపి మత ఘర్షణలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

- ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు
- విద్యార్థులకు మెళకువలపై ఉపాధ్యాయుల సూచనలు

పదోతరగతి పరీక్షలు ఏప్రిల్ 3నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది నుంచి ఆరు పేపర్లతోనే పరీక్షలు నిర్వహించనున్నారు. సిలబస్ మాత్రం పూర్తిగా చదవాల్సి ఉండగా రాయాల్సిన పరీక్షల సంఖ్య తగ్గుతోంది. అయినా ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించడం కష్టమే కాదంటున్నారు నిపుణులు. మరోవైపు పరీక్ష సమయం సమీపిస్తుండడంతో విద్యార్థులు ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. పరీక్షల్లో విద్యార్థులకు ఎదురయ్యే సందేహాల నివృత్తితో పాటు మెలకువలపై నిపుణుల సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి. – మంచిర్యాలఅర్బన్



భయాన్ని వదిలితే మెరుగైన ఫలితం...



గణితం అంటే కష్టమైన సబ్జెక్టు అనే భయాన్ని దూరం చేయాలి. అద్భుతమైన ఫలితాన్ని పొందవచ్చు. సూత్రాలు, సమస్య సాధనలో స్టెప్స్ మీద ఎక్కువ దృష్టి పెట్టాలి. కొన్ని ప్రశ్నలకు నిర్మాణ క్రమం రాయటం, గ్రాఫ్ గీయటంపై ప్రత్యేక సాధన చేయాలి. సమితులు సంఖ్యాశాస్త్రం, సంభావ్యత వంటి సులువైన చాప్టర్స్ నుంచి వచ్చే ప్రశ్నలపై ఎక్కువగా దృష్టి పెట్టాలి. సంఖ్యా వ్యవస్థ, బీజ గణితం, నిరూపక రేఖాగణితం, క్షేత్ర సితి, త్రికోణమితి అధ్యాయాలపై సంపూర్ణ అవగాహన అవసరం.

– కృష్ణ, గణితం, జెడ్పీఎస్ఎస్, వెల్గనూర్

ఆసకి ఆద్యంతం



ఇది పార్ట్‌బీ ప్రశ్నాపత్రం, సమయం గంటన్నర ఇస్తారు. ఈసబ్జెక్టులో విషయ అవగాహన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు అవసరం. పార్ట్ ఏ–30 మార్కులు, పార్ట్–బీ 10 మార్కులు ఉంటాయి. జీవశాస్త్ర పుస్తకంలో 10 పాఠ్యాంశాలకు మొదటి ఆరు పాఠాలు అనువంశికతపై విద్యార్థులు ఎక్కువ శ్రద్ధ చూపాలి. ప్రయోగాలపై అవగాహన అవసరం. అంశాల వారీగా చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్ సొంతంగా రూపొందించుకోవాలి. వాస్తవిక పరిస్థితులకు అన్వయిస్తూ పఠనం సాగాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై ఎంత పట్టు ఉంటే అంత మంచిది.

– శోభారాణి, బయోసైన్స్, జెడ్పీహెచ్ఎస్ చంద్రవెల్లి, బెల్లంపల్లి

సమయ నిర్వహణ కీలకం



ఈసారి రెండు పేపర్లు కాకుండా 80మార్కులు ఒకే పేపర్‌లో రాయాల్సి ఉంటుంది. తెలుగు మీడియం విద్యార్థులు భయపడొద్దు. పార్ట్ ఏ,బీ,సీ సెక్షన్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అక్షర దోషాలపై దృష్టిపెట్టాలి. టెక్స్ డిపెండెంట్, ఇండిపెండెంట్ అంశాలపై పట్టు సాధించాలి. డిస్కోర్స్ రాసేటప్పుడు స్పష్టంగా చక్కని లేఅవుట్ రాయాలి. వ్యాకరణ అంశాల ద్వారా ఖచ్చితమైన గరిష్ట మార్కులు సాధించవచ్చు. క్వశ్చన్ ట్యాగ్, వాయిస్, స్పీచ్, కంబైనింగ్, టెన్స్, ఆర్టికల్స్, ప్రిపోషిజన్, ఆంటోనిమ్, సినానిమ్స్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– వరప్రసాద్, జెడ్పీహెచ్ఎస్, వీగాం, భీమిని

ప్రయోగాలపై పట్టు అవసరం..



ప్రయోగ సమాచార సేకరణలో నైపుణ్యాలు, బొమ్మలు, నిత్య జీవితంలో వినియోగం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. పార్ట్ ఏ అంశాలను అప్లికేషన్ అప్రోచ్‌తో చదవాలి. చాప్టర్లను నిజజీవిత సంఘటనలో అన్వయించాలి. విషయ అవగాహనతో పాటు ప్రశ్నించటం, పరికల్పన చేయటం, ప్రయోగాలు, క్షేత్రపర్యటనలు, నైపుణ్యాలు, ప్రాజెక్టు పనుల పటాలు ద్వార లోతైన అధ్యయనం చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరిమాణ నిర్మాణం, కార్బన్, సమ్మేళనాలపై పట్టుసాధించాలి. పార్ట్ బీ కోసం ప్రతి పాఠ్యాంశాలోని ముఖ్యాంశాలతో బిట్ బ్యాంకు తయారు చేసుకోవాలి.

– తిరుపతి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, జెడ్పీఎస్ఎస్ దేవులవాడ

విషయ అవగాహనకు ఎక్కువ మార్కులు



–సాంఘిక శాస్త్రంలో విషయ అవగాహనకు ఎక్కువ మార్కులు ఉన్నందున పుస్తకంలోని ముఖ్యమైన భావనలు అర్థం చేసుకుని అడిగిన ప్రశ్నకు సరైన రీతిలో సమాధానాలు రాయాలి. వివరించటం, పోలికలు భేదాలు తెలపటం, కారణాలు, ఫలితాలు చెప్పటం, వర్గీకరించడం లాంటి రూపాల్లో ప్రశ్నలు ఉంటాయి. పటనైపుణ్యాలు, సమాచార నైపుణ్యాలు, ప్రశంస–సున్నితత్వం, ఇచ్చిన అంశాన్ని చదివి వ్యాఖ్యలు రాయటంపై సాధన చేయాలి. పటాలు, పట్టికలు, గ్రాఫ్‌లపై పట్టు ఉంటే ఎక్కువ మార్కులు వస్తాయి. పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. అభ్యాస దీపికలోని అంశాలను బాగా చదవాలి.

– మహేశ్, సోషల్ టీచర్, జెడ్పీహెచ్ఎస్ బాలుర, మంచిర్యాల

వ్యాకరణ అంశాలపై అభ్యాసం చేయాలి



ప్రతి పాఠంలోని వ్యాకరణ అంశాలు క్షుణంగా అభ్యాసం చేయాలి. ద్వితీయ భాషా హిందీలో 80 (పార్ట్ ఏ, బీ)లో 16 అంకేలు వస్తే పాస్. 100లో 20వస్తే పాస్ అవుతారు. పేరాగ్రాఫ్ పద్యాలు, వ్యాకరణ అంశాలు అభ్యాసం చేస్తే పక్క ఉత్తీర్ణులవుతారు. సృజనాత్మకతను పరీక్షించే లేఖారచన, వ్యాసాలు, సాక్షాతాకర్, కరపత్ర పోస్టర్ అంశాలను బాగా చదవాలి. బాషాదోషాల్లేకుండా అందంగా రాసేందుకు ప్రయత్నించాలి. పార్ట్ బీలో వ్యాకరణాంశాలుంటాయి. పాఠ్యపుస్తకంలోని బాషాకి బాత్ ఆధారంగా అభ్యసించాలి.

– నీలేష్ కుమార్, హిందీ ఉపాధ్యాయుడు

చేతిరాత ముఖ్యం



పద్యగద్యభాగంలోని ముఖ్యాంశాల్ని పునశ్చరణ ముఖ్యం. పాఠ్య పుస్తకంలోని విషయ అవగాహన కలిగి ఉండాలి. మంచిర్యాల రాతకు మంచి గుణములు పొందే అవకాశం ఉంటుంది. భాషా దోషాలు లేకుండా ఆకర్షణీయంగా రాయటానికి ప్రయత్నం చేయాలి. ఏయే పాఠ్యాంశాన్ని ఏకవి, రచయిత రాశారో తెలిసి ఉంటే నాలుగు లఘు సమాధాన ప్రశ్నలకు 12 మార్కులు పొందవచ్చు. వ్యాసాల్లో అపరిచిత గద్యం కూడా ప్రధానమే. దీన్ని సొంతంగా ఆలోచిస్తూ చదవాలి. ఉపవాచకానికి సంబంధించి పాత్రల స్వభావం తెలుసుకోవటం ప్రధానం. వ్యాకరణలో సందులు, సమాసాలు, అలంకారాలు, చందస్సుపై దృష్టి పెట్టాలి.. మంచి చేతిరాతతో మార్కులు లభిస్తాయి.

– సత్యనారాయణచారి, దుగ్నేపల్లి, చెన్నూర్

టీబీజీకేఎస్ కమిటీల్లో పలువురికి చోటు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌లో ఖాళీగా ఉన్న కొన్ని పోస్టులను భర్తి చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్షుడు బి.వెంకట్రావు ఆయా కమిటీల్లో తీసుకున్న వారి వివరాలను వెల్లడించారు. వీరిలో టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచీ సెక్రెటరీలుగా కానుగంటి చంద్రయ్య, గడ్డం మహిపాల్‌రెడ్డి, బ్రాంచీ అసిస్టెంట్ సెక్రెటరీలుగా అల్లా వెంకట్‌రెడ్డి, కె.బ్రహ్మచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రౌతు సత్యనారాయణ, తోట శ్రీనివాస్, ఐకే ఓసీపీ ఫిట్ సెక్రటరీగా కె.రత్నాకర్ రెడ్డి, ఆర్కే న్యూటెక్ ఫిట్ సెక్రటరీగా కందుల శంకరయ్య, ఎస్సార్పీ 1 అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా ఏ.తిరుపతిరావు, ఆర్కే న్యూటెక్ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా ఎండీ లాలా, ఆర్కే 5 అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా బత్తుల గోపి, ఎస్సార్పీ ఓసీపీ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా ఎండీ అమ్జత్, ఐకే 1ఏ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా డీ సతీశ్, ఐకే ఓసీపీ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా గోగర్ల గోపాల్‌లను నియమించారు. ఈ సందర్భంగా బ్రాంచీ ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, ఇతర బ్రాంచీ నేతలు జీఎంను కలిసి నూతనంగా కమిటీలో తీసుకున్న వారిని గుర్తించాలని కోరారు.

పది విద్యార్థులకు హాల్ టికెట్‌పై భరోసా

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల యాజమాన్యం హాల్‌టికెట్ ఇచ్చే విషయంలో ఇబ్బందులకు గురిచేస్తే ఆందోళన చెందకుండా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మంచిర్యాల డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ ద్వారా పరీక్షకు అనుమతిస్తారన్నారు. ఈనెల 3నుంచి 13 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. కాంపోజిట్ తెలుగు పరీక్ష రాసే విద్యార్థులకు అదనంగా 20 నిమిషాలు కేటాయించనున్నట్లు తెలిపారు. సామాన్య శాస్త్రం పరీక్ష విషయంలో అదనంగా 20 నిమిషాలు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి విషయంలో ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసుకునేందుకు సహాయ కేంద్రం (కంట్రోల్‌రూం)లో 08736–252420, జిల్లా పరీక్షల సహాయ అధికారి 7032463114లో సంప్రదించవచ్చన్నారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

మంచిర్యాఅర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్పాట్ వ్యాలూవేషన్ కేంద్రంలో ఈనెల 31 నుంచి ఇంటర్మీడియట్ మూల్యాంకన ప్రారంభం కానుంది. ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్ స్పాట్ వ్యాలూవేషన్ జరుగనుంది. జిల్లాలోని అన్ని కళాశాల ప్రిన్సిపాళ్లు స్పాట్ వ్యాలూవేషన్ డ్యూటీ టీచర్లను ఖచ్చితంగా రిలీవ్ చేయాలని డీఐఈవో శైలజ తెలిపారు.

సీతారాముల కల్యాణంలో సీఎల్పీ నేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి శ్రీకోదండ రామాలయంలో గురువారం శ్రీసీతారాముల వివాహ మహోత్సవ వేడుకల్లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా బుధవారం రాత్రి బెల్లంపల్లిలో బస చేసిన భట్టి విక్రమార్క శ్రీరామనవమిని పురస్కరించుకుని పాదయాత్రకు ఒకరోజు విరామం ప్రకటించారు. ఈ మేరకు కోదండ రామాలయానికి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావుతో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ధర్మకర్తలు భట్టి విక్రమార్కకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తు తం కేంద్రంలో ,రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజాభిష్టాన్ని పాటించకపోవడం దురదృష్టకరమన్నారు. అందరికి శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.



పూజలు చేస్తున్న భట్టి విక్రమార్క

ప్రాణం తీసిన వేగం

- బాలుడు, యువకుడు మృతి
- బైక్‌తో అగి ఉన్న లారీని ఢీకొన్న వైనం
- పండుగ వేళ ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల ప్రకారం... గుడిపేట గ్రామానికి చెందిన సంగెం శ్రీధర్ (చింటూ) (20), శ్రీహరి(14) ద్విచక్ర వాహనంపై రాత్రి వేళ బయటకు వచ్చారు. జాతీయ రహదారిపై స్పోర్ట్ బైక్‌పై అతివేగంతో వెళ్తూ బెటాలియన్ శివారులో లక్సెట్టిపేట వైపు వెళ్తున్న వెళ్తున్న లారీ జాతీయ రహదారిపై నిలిపి ఉండగా దానిని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పారిపోయాడు. సీఐ తోట సంజీవ్, హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ సంఘటన స్థలానికి చేరుకుని వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. మృతదేహాలను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



శ్రీధర్ మృతదేహం



శ్రీహరి మృతదేహం

జాతీయ పురస్కారానికి 'గొల్లపల్లి'

- ప్రతిపాదిస్తూ నివేదిక పంపిన ప్రభుత్వం
- జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి 27 పంచాయతీలు
- నేడు రాష్ట్రాస్థాయి పురస్కారాలు అందుకోనున్న జీపీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కేంద్ర ప్రభుత్వం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అందజేసే 'దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్'కు మంచిర్యాల జిల్లా నుంచి నెన్నెల మండలంలోని గొల్లపల్లి గ్రామ పంచాయతీ ఎంపికైంది. 9 అంశాల్లోనూ అత్యధిక మార్కులు సాధించి జిల్లా, రాష్ట్ర స్థాయి పురస్కారంతో పాటు జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ పురస్కారాన్ని అందుకోబోనుంది. నేడు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పురస్కారం అందుకోనుంది.

ఎంపికైన గ్రామాలు... విభాగాల వారీగా

జిల్లాలోని 16 మండలాల్లోని 310 గ్రామాల్లో 27 గ్రామ పంచాయతీలను రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపిక చేశారు. అందులో మండలంలోని ముత్యంపల్లి, భీమిని మండలంలోని మల్లిడి, బెల్లంపల్లి మండలంలోని అంకుశం గ్రామాలు ఎంపికయ్యాయి. ఆరోగ్యవంతమైన పంచాయతీలుగా హాజీపూర్ మండలంలోని గుడిపేట, భీమిని మండలంలోని లక్ష్మీపూర్, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీలుగా భీమిని మండలంలోని లక్ష్మీపూర్, చిన్నగుడిపేట, బెల్లంపల్లి మండలంలోని కన్నాల్, నీటి వనరులు పుష్కలంగా ఉన్న పంచాయతీలుగా హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి, బెల్లంపల్లి మండలంలోని బుదాఖుర్ద్, తాండూర్ మండలంలోని గోపాల్‌నగర్, పచ్చదనం, పరిశుభ్రత విభాగంలో భీమిని మండలంలోని ఖిట్టూర్‌పల్లి, లక్ష్మీపూర్, వేమనపల్లి మండలంలోని వేమనపల్లి, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు ఉన్న పంచాయతీలుగా హాజీపూర్ మండలంలోని గుడిపేట, జన్నారం మండలంలోని పొన్కల్, దండేపల్లి మండలంలోని మాదరిపేట, సామాజిక భద్రత కలిగిన పంచాయతీలుగా నెన్నెల మండలంలోని గొల్లపల్లె, కాసీపేట మండలంలోని కోమటిచెను, దండేపల్లి మండలంలోని తానిమడుగు, సుపరిపాలన పంచాయతీలుగా కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, భీమిని మండలంలోని చిన్నగుడిపేట, లక్ష్మీపూర్ గ్రామాలు, మహిళా స్నేహపూర్వక పంచాయతీలుగా దండేపల్లిలోని కొండాపూర్, నెన్నెల మండలంలోని గుండ్లసోమారం, జన్నారం మండలంలోని లింగాలపల్లి గ్రామాలు ఎంపికయ్యాయి.



నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామంలోని వైకుంఠధామం

సమష్టి కృషితో గుర్తింపు



మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ ఉత్తమ పంచాయతీ పురస్కారానికి వరసగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక అవుతామన్న నమ్మకానికి గ్రామస్తులు పూర్తి సహకారం తోడు కాగా అధికారులు, ప్రజాప్రతినిధుల తోడ్పాటు మరింత బలాన్ని చేకూర్చింది.

– ఇందూరి శశికళ, సర్పంచ్, గొల్లపల్లి

ఉత్తమ గ్రామ పంచాయతీగా 'మార్లవాయి'



మార్లవాయి గ్రామ పంచాయతీ



సర్పంచ్ కనక ప్రతిభ

కెరమెరి(జైనూర్): నేషనల్ పంచాయతీ అవార్డుల్లో భాగంగా ఇప్పటికే మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు పొందిన జైనూర్ మండలంలోని మార్లావాయి గ్రామ పంచాయతీ రాష్ట్ర స్థాయిలోనూ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికైంది. 'పేదరిక రహిత, మెరుగైన మౌళిక సదుపాయాలు' అనే అంశంలో ఈ గ్రామ పంచాయతీ ఎంపికైంది. ఈ మేరకు మార్లవాయి గ్రామ పంచాయతీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్, గ్రామ కార్యదర్శి మనోజ్ హైదరాబాద్‌కు బయలు దేరారు.



శ్రీరాముడి విగ్రహంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



దండేపల్లి: ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తూ..

రాములోరి శోభాయాత్ర

మంచిర్యాలలో గురువారం శ్రీరామ నవమి సందర్భంగా రాములోరి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణ మందిర్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పట్టణ పురవీధుల్లో సాగింది. మార్వాడీ ప్రగతి సమాజ్, మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో శోభాయాత్రలో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మహిళల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, మార్వాడీ ప్రగతి సమాజ్ జిల్లా అధ్యక్షుడు బ్రిజ్‌మోహన్‌రేణ్వా, యువమంచ్ అధ్యక్షుడు గోపాల్‌జోషి హాజరయ్యారు. – మంచిర్యాలఅర్బన్